## క్లుప్తంగా

### నేటి నుంచి ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభలు

ఉంగుటూరు: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభలు ఈ నెల 3 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల వివరాలు... ఈ నెల 3న ఆముదాలపల్లి, గారపాడు, ఆత్కూరు, కొయ్యగూరపాడు, 4న చాగంటిపాడు, మధిరపాడు, బొకినాల, చికినాల, 6న వెల్దిపాడు, వెన్నూతల, ఎలుకపాడు, నాగవరప్పాడు, 7న లంకపల్లి అగ్రహారం, ఇందుపల్లి, ముక్కపాడు, 8న మానికొండ, తరిగొప్పల, వేమండ, నందమూరు, 9న ఎన్‌ఏ పేట, పొణుకుమాడు, పొట్టిపాడు, పెద అవుటపల్లి, 10న ఉంగుటూరు, వేంపాడు, తేలప్రోలు, తుట్టగుంట గ్రామాల్లో గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, గ్రామ సచివాలయ గృహసారథులు, వలంటీర్లు, పాలకేంద్రం అధ్యక్షులు పాల్గొనవల్సిందిగా ఎంపీడీవో కోరారు.

### 386 మందికి వైద్యపరీక్షలు

పెనమలూరు: పోరంకి శ్రీనివాసనగర్ శ్రీషిర్డీ సాయిబాబా మందిర ప్రాంతంలో గురువారం ఉచిత వైద్య శిబిరంలో 386 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు స్థానికులకు ఎముకలు, కీళ్ల, నరాలు, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో వైద్యులు ఎంజే నాయుడు, రవితేజ, వంశీకృష్ణ, నాగేశ్వరరావు, జ్యోతిలు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో షిర్డీ సాయిబాబా మందిరం చైర్మన్ మున్నంగి అర్జున్‌రెడ్డి, ఎంజే నాయుడు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజినీకాంతశర్మ, మందిరం కార్యదర్శి కొండపల్లి రామ్మోహన్‌రావు, కోశాధికారి కృష్ణమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

### కేడీసీసీ బ్యాంకింగ్ సేవలపై కళాజాత ప్రదర్శన

గన్నవరం: మండలంలోని బుద్దవరం సొసైటీ ఆవరణంలో కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యాన కళాజాత ప్రదర్శన గురువారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి ఆదేశాల మేరకు నాబార్డ్ సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కేడీసీసీ బ్యాంక్ అందజేస్తున్న వివిధ రకాల రుణ సదుపాయలు, పొదుపు ఖాతాల ఆవశ్యకతను కళాకారులు వివరించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు ప్రయోజనాలు గురించి కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా రైతులను చైతన్యవంతులను చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నక్కా కృష్ణయ్య, పలువురు సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నేటి నుంచి రోజూ అయ్యప్ప మాలధారులకు అన్నదానం

గన్నవరం రూరల్: అయ్యప్ప మాల ధరించిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు మండలంలోని బీబీగూడెం గ్రామంకు చెందిన అయ్యప్ప భక్తుడు గుజ్జర్లపూడి రాజేష్ తెలిపారు. ఈ నెల 3 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకూ ప్రతి రోజూ మధ్యాహ్నం 12నుంచి 2గంటల మధ్య అన్నదానం జరుగుతుందని ఆయన గురువారం వివరించారు. స్థానిక సెంటర్‌లో రాజేష్ ఆధ్వర్యంలో గడచిన 7సంవత్సరాలుగా అయ్యప్ప భక్తులకు అన్నదానం కొనసాగుతోంది.

### 10న కంకిపాడులో జగనన్నకు చెబుదాం

కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కంకిపాడు పట్టణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష గురువారం తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా గల శ్రీకృష్ణా కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కార్యక్రమానికి హాజరై ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. మండలానికి సంబంధించిన సమాచారాన్ని మండల, గ్రామస్థాయి అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు సుగాలీకాలనీకి చెందిన గుగులోతు గున్య వ్యవసాయ కూలీగా పని చేస్తుంటాడు. వందడుగుల రోడ్డులో అతను పొలంలో మందు కొట్టడానికి తిరుమలశెట్టి వాణి అనే వ్యవసాయ కూలిని బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా తాడిగడప జంక్షన్ వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న గున్య, వాణి కింద పడిపోవటంతో గాయాలు అయ్యాయి. వారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# అభివృద్ధి దిశగా కుందేరు

- శరవేగంగా మౌలిక వసతుల కల్పన
- సమకూరుతున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు
- అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు

కంకిపాడు: అభివృద్ధి దిశగా కుందేరు గ్రామం అడుగులు వేసోస్తోంది. మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోంది. వసతుల కల్పనతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**రూ.2.09 కోట్లతో అభివృద్ధి పనులు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామం అభివృద్ధి చెందుతోంది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా స్థానిక పాలకవర్గం కృషి చేస్తోంది. ఇప్పటివరకూ రూ.2.09 కోట్ల మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ప్రధానంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షానికి మురుగు కదలక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే పార్థసారథి గడపగడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించగా, రూ.17 లక్షల అంచనా వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశారు. మరో రూ.3 లక్షలతో ప్రధాన గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన అంగన్‌వాడీ కేంద్రం పూర్తి


సిద్ధమైన సచివాలయ భవనం

స్థాయిలో సిద్ధం చేసేందుకు మండల పరిషత్ నుంచి రూ.4 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో అవసరమైన మరమ్మతులు, భవన నిర్మాణం పూర్తి చేసి అంగన్‌వాడీ చిన్నారులకు అందుబాటులోకి తెచ్చారు.

**116 మందికి ఇళ్ల స్థలాలు కేటాయింపు**

గ్రామంలో అర్హులైన పేదలకు నివేశన స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్సీ కాలనీకి సమీపంలో 2.80 ఎకరాల భూమిని సేకరించారు. ఈ ప్రాంతంలో 116 మందికి నివేశన స్థలాలను కేటాయించారు. జగనన్న కాలనీలో ప్రధానంగా రహదారులు, మెరక పనులకు రూ.50 లక్షలు వెచ్చించి వసతులు కల్పించారు. ప్రస్తుతం 90కి పైగా ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

**శాశ్వత వంతెన నిర్మాణానికి కృషి**



గ్రామంలో మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యతాక్రమంలో జరుగుతోంది. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్య రైవస్ కాలువపై శాశ్వత వంతెన నిర్మాణం. ఈ వంతెన అసంపూర్తిగా ఉంది. ఎమ్మెల్యే పార్థసారథి అవరోధాలను పరిష్కరించి వంతెన నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నారు.

–కలకోట రాధికారెడ్డి, సర్పంచ్, కుందేరు


రైతులకు అందుబాటులో రైతుభరోసా కేంద్రం

**ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయం, రైతుభరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి రూ.79.29 లక్షల నిధులు కేటాయించింది. భవనాల నిర్మాణానికి స్థలం ప్రధాన సమస్యగా మారింది. గ్రామస్తుల చొరవతో దాత కలకోట ఉమామహేశ్వరరెడ్డి తన 29 సెంట్ల స్థలాన్ని వితరణగా అందించారు. ఈ స్థలంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మించారు. కార్యాలయాలకు వెళ్లేందుకు రూ.3 లక్షల అంచనాతో రహదారి నిర్మాణం, భవనాల చుట్టూ ప్రహరీ


ముస్తాబైన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటరు

నిర్మాణాన్ని రూ.6 లక్షలతో పూర్తి చేసి ప్రాంగణానికి రక్షణ చేకూర్చారు. నాడు–నేడు కింద ప్రభుత్వం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను రూ.30 లక్షల అంచనాతో అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్దింది.

## జాతీయ రహదారిపై పచ్చదనం


పోరంకి వద్ద జాతీయ రహదారి పక్కనే పచ్చదనంతో ఉన్న చెట్లు

**ప్రయాణికులకు ఉపశమనం**

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంది. పోరంకి సెంటర్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి బందరు రోడ్డు డివైడర్ మధ్యలో పచ్చదనంతో చెట్లు ఉండటంతో ప్రయాణికులు ఎంతో ఆహ్లాదం పొందుతున్నారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి మండల పరిధిలో కానూరు నుంచి గోసాల వరకు విస్తరించి ఉంది. అయితే పోరంకి–పెనమలూరు డివైడర్ మధ్యలో కొందరు పర్యావరణ ప్రేమికులు అధికారుల సహకారంతో మొక్కలు నాటారు. అవి ఇప్పుడు పెద్ద చెట్లుగా ఎదిగి ప్రయాణీలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రీనరీతో రహదారి ఆకట్టుకుంటోంది. ఎండ సమయంలో ప్రయాణీలకు నీడనిస్తున్నాయి. రాత్రి సమయంలో ఎదురెదురుగా వాహనలు వచ్చే సమయంలో హెడ్‌లైట్ల కాంతి కళ్లల్లో పడకుండా చెట్లు అడ్డుకుంటున్నాయి. జాతీయ రహదారి పక్కన చెట్లు ఉండటంతో కాలుష్య నివారణకు సైతం ఉపయోగపడుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు.

**మిగతా ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటాలి**

కానూరు నుంచి గోసాల వరకు నిత్యం ట్రాఫిక్ ఉండటంతో ఈ ప్రాంతం వరకు డివైడర్ మధ్యలో మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్‌హెచ్‌ఐ అధికారులు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటితే భవిష్యత్తులో జాతీయ రహదారి ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా కానూరు– పోరంకి మధ్యలో జాతీయ రహదారి పక్కన డివైడర్ మధ్యలో చెట్లు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు పేర్కొన్నారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న పింఛన్ పంపిణీ


తాడిగడపలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

పెనమలూరు: మండల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మండల పరిధిలో మొత్తం 18,563 పింఛన్‌లు ఉండగా ప్రభుత్వం రూ 5.16 కోట్లు నిధులు విడుదల చేసింది. వలంటీర్లు 2వ రోజు గురువారం ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు. తాడిగడప కారిమ్మకనగర్ 2లో వలంటీర్ ఫణీంద్ర వృద్ధాప్యంతో కదలలేని స్థితిలో ఉన్న గుడివాడ రంగనాయకులికి ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశాడు.

## అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 10.28 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ. 10.28లక్షలు వచ్చినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఈవో సన్యాసిరావు పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు గురువారం నిర్వహించారు. గత 70 రోజులకు గానూ రూ.10,28,339 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

## ఈ నెల 9న అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ హుండీ ఈ నెల 9న లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఉన్నం వెంకటప్రసాదరావు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు 9వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆయన గురువారం తెలిపారు. హుండీ లెక్కింపులో భక్తులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

## సీడీసీ చైర్మన్‌గా రాజులపాటి

ఉయ్యూరు: చెరకు అభివృద్ధి మండలి(సీడీసీ) చైర్మన్‌గా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు నియమితులయ్యారు. సీడీసీ పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉయ్యూరుకు చెందిన రాజులపాటి రామచంద్రరావును చైర్మన్‌గా, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వీర్ల శ్రీనివాసరావు, తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన కస్తూరి సాంబశివరావును పాలకవర్గ సభ్యులుగా నియమిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేదీ ఉత్తర్వులు వెలువరించారు. చైర్మన్‌గా నియమితులైన రాజులపాటిని రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కలిసి గురువారం అభినందనలు తెలిపారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో గురజాడ గ్రామానికి చెందిన రైతులు చెరకు గడలను బహూకరించి సత్కరించారు.


రాజులపాటికి చెరకు గడలను బహూకరించి అభినందనలు తెలుపుతున్న రైతులు

## దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

ఉయ్యూరు: దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణ ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని శిరీషా మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని స్పందన సేవా సమితి సభ్యులు గురువారం సందర్శించారు. దివ్యాంగులకు రూ.10 వేలు విలువ చేసే నిత్యావసరాలు అందించారు. మధ్యాహ్న భోజనాన్ని వడ్డించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల పట్ల చూపుతున్న ఆదరణ, అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పిస్తున్న శిరీషా మానసిక దివ్యాంగుల కేంద్ర ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాంప్రసాద్, పివి. రమణ, బి.సాంబశివరావు, పూర్ణరాజు, యశోధ, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు అందిస్తున్న స్పందన సేవా సమితి సభ్యులు

## అవినీతి రహిత సమాజ స్థాపన అందరి లక్ష్యం

కంకిపాడు: అవినీతి రహిత సమాజ స్థాపన అందరి లక్ష్యం కావాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కంకిపాడు బ్రాంచ్ మేనేజర్ పల్లి ఉదయ్ కుమార్ అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గొడవర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో అవినీతి నిర్మూలన–దేశ ప్రగతి అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అవినీతి రహిత సమాజ స్థాపనకు అడుగులు పడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిరోధం అందరి బాధ్యత

గన్నవరం రూరల్: బాల్య వివాహాలు నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సావరగూడెం సర్పంచి అట్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో జరిగిన బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండే వరకూ వివాహాలు చేయరాదని చెప్పారు. క్రాఫ్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రమోద్, ఉపసర్పంచి అర్జున్‌రావు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు నున్న గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సచివాలయం–1కి సంబంధించి కోపరేటివ్ గోడౌన్ (ఆంధ్రాబ్యాంక్) వద్ద శుక్రవారం ఉదయం 9 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించబడుతుందని గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ప్రభుత్వానికి చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేస్తారని చెప్పారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోరారు.

## నున్న ఇన్‌చార్జి కార్యదర్శిగా చెన్నకేశవరావు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవి రమణ సెలవులో వున్నందున, పాతపాడు గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావును నున్న గ్రామానికి ఇన్‌చార్జి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన అంబాపురం, జక్కంపూడి గ్రామాలకూ ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

## పేదలకు అందుబాటులో వైద్య సేవలు


యనమలకుదురులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామారావు


రామవరప్పాడులో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పెనమలూరు: పేదలకు వైద్య సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. యనమలకుదురు 4వ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన గురువారం పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డు సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు తీసుకువచ్చి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. వైద్య సేవలతో పాటు ఉచిత మందులు పంపిణీ చేస్తున్నామని ప్రకాశరావు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి బి.రామారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. దీర్ఘకాల వ్యాధులు ఉన్న వారికి భవిష్యత్తులో కూడా వైద్య సేవలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నానావత్ చిన్ని, వైఎస్సార్ సీపీ నేతలు ఫజల్‌హాక్, ఎం.డి.ఖాన్, షేక్.మౌలాలి, కరీముల్లా, అన్వర్, మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, వైద్య శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నాణ్యమైన వైద్య సేవలు**

రామవరప్పాడు: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నారని రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు 4వ సచివాలయం పరిధిలో పీఎస్‌ఆర్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 600 మందికి పైగా వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అనంతరం అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న రోటరీ కమ్యూనిటీ ట్రస్టు మేనేజర్ కోటిరెడ్డి, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్

**రోటరీ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు**

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి సమస్యలు గుర్తించిన పలువురు రోగులకు ఉయ్యూరు రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టులో కంటి శస్త్ర చికిత్సలు గురువారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు జరిగాయి. కంటి సమస్యలు ఉన్న రోగులకు ఉయ్యూరు రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టులో శస్త్ర చికిత్సలు నిర్వహించి కళ్ల జోళ్ళు, అవసరమైన మందులు అందించారు. రోగులను ట్రస్టు మేనేజరు కోటిరెడ్డి, ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ పరామర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు.

## యువత ఓట్ల నమోదుపై బీఎల్‌ఓలు దృష్టి పెట్టాలి

**ఆర్డీఓ రాజు**

పెనమలూరు: యువత ఓట్లు నమోదులో బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బూత్ లెవల్ అధికారులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గంలో ఉన్న 304 పోలింగ్ కేంద్రాకు సంబంధించిన బీఎల్‌ఓలు 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువత ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను బీఎల్‌ఓలు విధిగా పాటించాలని తెలిపారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

**4–5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు..**

ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని ఆర్డీఓ రాజు తెలిపారు. బూత్ లెవల్ అధికారులు పై తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలన్నారు. ఓటు నమోదు చేసుకోవడానికి వచ్చే వారికి తగిన సూచనలు, సలహా ఇచ్చి సహకరించాలని సూచించారు. సదస్సులో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు తహసీల్దార్‌లు కట్టా వెంకటశివయ్య, ప్రసాద్, మస్తాన్, ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగం సిబ్బంది, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఆర్డీఓ రాజు

## దాతల తోడ్పాటు అభినందనీయం

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు దాతలు తోడ్పాటునందించడం అభినందనీయమని హెచ్‌ఎం వేలూరి వెంకటఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని తేలప్రోలులో డాక్టర్ బి.కె.ఎం.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రారంభించిన మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు గ్రామ ప్రముఖుడు దివంగత ఆళ్ల నారాయణరెడ్డి కుమార్తె విశ్రాంత కల్నల్ ఆళ్ల అరుణ రెండు జతల యూనిఫాంలు గురువారం అదించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతల తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగించుకుని ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, కమిటీ సభ్యులు, హెచ్‌ఎం దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులకు యూనిఫాంలు అందజేసిన విశ్రాంత కల్నల్ అరుణ

## విద్యార్థులు సాంకేతిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

పెనమలూరు: మారుతున్న సాంకేతిక అభివృద్ధిపై విద్యార్థులు దృష్టి పెట్టాలని ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్(ఐఈటీఈ) 70వ వార్షికోత్సవం సందర్భంగా విజన్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన గురువారం పాల్గొన్నారు. భవిష్యత్తులో దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి నేటి విద్యార్థులు ఉపయోగపడాలని పేర్కొన్నారు. విద్యార్థులు వారి నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీకే రావు, ప్రొఫెసర్ బీఎస్ఎన్ రెడ్డి, ఐఈటీఈ విజయవాడ చైర్మన్ బి.రాజశేఖర్, కార్యదర్శి సుజిత్, ట్రెజరర్ బి.సూర్యకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఈసీఈ విభాగాధిపతి సి.సుబ్బారావు ,అధ్యాపకులు పాల్గొన్నారు.


సీనియర్ ఇంజినీర్‌ను సన్మానిస్తున్న ఐఈటీఈ సభ్యులు

## వలస కూలీలకు ఉచితంగా దుస్తులు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వే స్టేషన్ సమీపంలో నివసిస్తున్న వలస కార్మికులకు మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసి జీవిస్తున్న వలస కూలీలకు సుమారు 80 మందికి దుస్తులు అందించారు. పేదలకు తోచిన విధంగా సాయం అందించే లక్ష్యంతోనే సేవా సమితి ఏర్పాటు చేశామని అధ్యక్షుడు లంక రమేష్ తెలిపారు. సేవా సమితి కార్యదర్శి పునుకొల్లు తేజ పాల్గొన్నారు.